# 4. తెలుగు జాతీయాలు

## 20 పంక్తుల సమాధాన ప్రశ్నలు

**1. నాలుగు తెలుగు జాతీయాలను ఉదాహరణల సహాయంతో వర్ణించండి.**

జ. ఈ జాతీయములు, కొన్ని తెలుగు సాహిత్యంలో తెలుగు వాళ్ళ వాడుకలో పుట్టి వ్యాప్తిలోకి వచ్చాయి. మరికొన్ని, సంస్కృత వాఙ్మయంలో పుట్టినా తెలుగువారు వాటిని సొంతం చేసుకున్నారు. కొన్ని జాతీయములను పరిశీలిద్దాము.

**1. ఆముదపు చెట్టు :** చిన్నదయితే మొక్క అని, పెద్దదయితే చెట్టు అని అంటాము. చేవతేలేది చెట్టు. చేవ తేలనిది మొక్క అని గమనించాలి.

కలికాలంలో నేలబారున పెరిగే వెంపలి చెట్టుకు, నిచ్చెనలు వేసి ఎక్కేవారు పుడతారని చెప్పారు. "చెట్లు లేని చోట ఆముదపు చెట్టే మహావృక్షం" అనే సామెత వాడుకలో ఉంది.

సమర్థులు లేనిచోట ఉన్నంతలో అతగాడే గొప్పవాడు అనే అర్థములో, "అతగాడు ఆముదపు చెట్టులాంటి వాడు" అంటారు. తనకు పోటీదారు కాని, తనను మించినవాడు కాని లేనిచోట తానే అందరికన్నా గొప్పవాడినని చెప్పుకొని బ్రతికే వ్యక్తిని "ఆముదపు చెట్టు" అని వేళాకోళంగా పిలుస్తారు.

**2. ఉడుంపట్టు :** "ఉడుము బల్లి జాతి జంతువు. కోటగోడలు ఎక్కటానికి ఉడుము నడుముకు త్రాళ్ళు కట్టి దాన్ని కోటగోడ పైకి విసిరేవారు. ఉడుము కోటగోడను పట్టుకుంటే ఇక దాన్ని వదిలేది కాదు. ఉడుము చప్పుడు చేయదు. ఉడుముకు కట్టిన త్రాళ్ళు పట్టుకొని, సైనికులు కోటగోడలు ఎక్కేవారు.

మాటా, పలుకూ లేకుండా తాను అనుకున్న పనిని పట్టుదలగా నెరవేర్చుకొనే పట్టుదలను "ఉడుంపట్టు"అంటారు. ఉడుము నిశ్శబ్దంగా ఎంత బరువును అయినా మోస్తూ, ఏటవాలుగా, నిలువుగా ఉన్న కోటగోడను కరచి పట్టుకొని ఎక్కి తన పని నెరవేరుస్తుంది. దానిని బట్టి 'ఉడుంపట్టు' అనే జాతీయం ఏర్పడింది.

**3. కీలుబొమ్మ :** తోలుబొమ్మలను ముక్కలు ముక్కలుగా చేస్తారు. అంచుల్లో రంధ్రాలు వేసి అతుకుతారు. వాటిని ముక్కలుగా నరికిన కొయ్యలకు తాపడం చేసి, కీళ్ళ దగ్గర జారుమడిని వేస్తారు. బొమ్మల శరీర భాగాలు సులభంగా కదలడానికి వీలుగా, కీళ్ళదగ్గర దారాలకు మరికొన్ని పొడవైన దారాలు కట్టి, వాటిని వేళ్ళతో పట్టుకొని, తెరవెనుక కళాకారులు నిలబడి ఆ బొమ్మలను ఆడిస్తారు.

ఆ కళాకారుడి శక్తిని ఆ బొమ్మల భాగాలు ఎలా కావాలంటే అలా కదులుతాయి. ఆడించే వాడి నేర్పు మీద ఆధారపడి బొమ్మలు ఆడుతాయి. ఆ బొమ్మలకు వ్యక్తిత్వం లేదు. స్వాతంత్ర్యం లేదు. అంతా ఆడించేవాడి దయ. ఇష్టం.

ఈ లక్షణాలను చూసి, ఇతరుల అభిప్రాయాలకు అనుగుణంగా స్వబుద్ధి, స్వప్రయత్నము లేకుండా వ్యవహరించే వారిని కీలుబొమ్మలు అని ఎద్దేవా చేస్తూ ఉంటారు.

**4) *గతజల సేతుబంధం* :** నీరు పోయిన తరువాత ఆనకట్టను కట్టడం అని దీని అర్థం. నీరున్నప్పుడే అవి నిలవటానికి, పొర్లిపోకుండా ఉండటానికి అడ్డుకట్ట వేయాలి. నీరు లేనపుడు అడ్డుకట్ట కట్టడం వ్యర్థం.

జరిగిపోయిన విషయాన్ని గురించి తరువాత బాధపడి, చేసిన తప్పును సవరించుకోవడం వల్ల ప్రయోజనం ఉండదు. కొందరు ప్రస్తుత కర్తవ్యం ఆలోచించకుండా, జరిగిన తప్పలను తలచుకొని బాధపడుతూ ఉంటారు. ఆ సందర్భాల్లో 'గతజల సేతుబంధం' ఎందుకని హెచ్చరిస్తూ, ఓదారుస్తూ ఈ మాటలు మాట్లాడతారు.

## సంక్షిప్త సమాధాన ప్రశ్నలు

**1. 'ఉడుంపట్టు పదబంధాన్ని వర్ణించండి.**

జ. 'ఉడుమును' పూర్వం రాజులు పెంచేవారు. వారు కోటగోడలు ఎక్కవలసినప్పుడు ఉడుము నడుముకు తాళ్ళు కట్టి, శక్తి కొద్దీ కోటగోడ పైకి దాన్ని విసిరేవారు.

ఉడుము ఎంత జారుడుబండల గోడలకయినా పట్టుకుందంటే, ఇక వదలదు. ఉడుము చప్పుడు చేయదు. భటులు ఉడుము నడుముకు కట్టిన త్రాళ్ళు పట్టుకొని, కోటగోడల మీదికి చేరుకొనేవారు.

ఈ విధంగా మాటా, పలుకూ లేకుండా తాను అనుకున్న కార్యాన్ని పట్టుదలగా దీక్షతో నెరవేర్చుకొనే వ్యక్తుల పట్టుదలను, "ఉడుంపట్టు" అంటారు.  ఎలుగుబంటి అరుస్తుంది. కాని ఉడుము మాత్రం నిశ్శబ్దంగా ఎంత బరువైనా మోస్తూ ఏటవాలుగా, నిలువుగా ఉన్న గోడను కరచుకొని, తన పని పూర్తి చేస్తుంది. అందుకే "ఉడుంపట్టు" అంటారు.

**2. భగీరథుని కథను తెలపండి.**

జ. సగర చక్రవర్తికి ఇద్దరు భార్యలు. ఔర్వమహర్షి వరంతో సగరుడి మొదటి భార్యకు ధర్మాత్ముడు పుట్టాడు. రెండవ భార్యకు 60 వేల మంది పుత్రులు పుట్టారు. సగరుడు అశ్వమేధయాగం చేశాడు. యజ్ఞం యొక్క గుఱ్ఱం వెంట వెళ్ళిన సగరుని 60 వేలమంది పుత్రులు కపిల మహర్షి కోపాగ్నికి భస్మం అయ్యారు.

సగరుని వంశంలో నారాయణ మూర్తి దయతో భగీరథుడు పట్టాడు. భగీరథుడు తన పెదతండ్రులను బ్రతికించాలని బ్రహ్మనూ, గంగానదినీ, చివరకు శివుణ్ణీ మెప్పించాడు. భగీరథుడు ఆకాశగంగను శివుడి తలమీద నుండి హిమాలయాల మీదికి, హిమాలయాల నుండి భూమికీ, భూమి నుండి పాతాళానికి చేర్చాడు. గంగానదిని భగీరథుడు పెద్ద తండ్రుల బూడిద మీద నుంచి ప్రవహింపజేసి, వారిని బ్రతికించుకున్నాడు.

గంగానది పాతాళానికి వెళ్ళే దారిలో ఎన్నో ఆటంకాలు వచ్చాయి. గంగానది జహ్నుమహర్షి ఆశ్రమాన్ని ముంచబోయింది. ఆ మహర్షి గంగను త్రాగాడు. భగీరథుడు ఆ మహర్షి కాళ్ళమీద పడి, గంగను విడిపించుకున్నాడు. ఈ విధంగా భగీరథుడు ఎన్నోకష్టాలు పడి గంగను పాతాళానికి తీసికొని వెళ్ళి పెద్ద తండ్రులను బ్రతికించుకున్నాడని పురాణాల్లో ఉంది.

# ఏకవాక్య సమాధాన ప్రశ్నలు

**1. తెలుగు జాతీయాలు పాఠ్యభాగం ఏ గ్రంథంలోనిది ?**

జ. తెలుగు జాతీయాలు అనే పాఠ్యభాగం డా॥ బూదరాజు రాధాకృష్ణ రచించిన తెలుగు జాతీయాలు' అనే గ్రంథంలోనిది.

**2. రాధాకృష్ణగారు పరిశోధన ఏ అంశంలో చేశారు ?**

జ. రాధాకృష్ణగారు "తొలినాటి తెలుగు శాసనాలలో చారిత్రక వ్యాకరణం అనే అంశంపై పరిశోధన చేశారు.

**3. రాధాకృష్ణ రచించిన భాషా సంబంధిత గ్రంథాలేవి ?**

జ. రాధాకృష్ణగారు 1) వ్యావహారిక భాషావికాసం 2) భాషాశాస్త్ర వ్యాసాలు 3) పురాతన నామకోశం 4) మాటల మూటలు 5) వాడుక మాటలు – మాటల వాడుక 6) కళలపై మాండలిక వృత్తి పదకోశం 7) మాటలూ – మార్పులు 8) ఈనాడు వ్యవహారకోశం మొ॥నవి.

**4. రాధాకృష్ణగారి రచనాశైలి, ఉపన్యాస ధోరణి ఎటువంటిది ?**

జ. వీరి రచనలు చాలా వివరంగా, సమగ్రంగా, కదళీపాకంలో ఉంటాయి. వీరి ఉపన్యాసం ప్రవాహంలా దూసుకొని వచ్చే వాక్ జలధి.

**5. రాధాకృష్ణగారిని ఆత్మీయులు ఏమని పిలుచుకుంటారు ?**

జ. రాధాకృష్ణగారిని ఆత్మీయులు "బూరా" అని పిలుస్తారు.

**6. ఆముదపు చెట్టును ఉద్దేశించిన తెలుగు సామెత ఏమిటి ?**

జ. చెట్టలేని చోట ఆముదపు చెట్టే మహావృక్షం" అనే తెలుగు సామెత వాడుకలో ఉంది.

**7. 'ఉడుము' ఏ జాతికి చెందిన జంతువు ?**

జ. ఉడుము బల్లి జాతికి చెందిన జంతువు.

**8. బ్రహ్మదేవునికి మొదట ఎన్ని తలలుండేవి ?**

జ. బ్రహ్మదేవునికి మొదట ఐదు తలలు ఉండేవి.

✡✡✡